Registered No : APTEL/25/A1201

గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ఆదివారం 04-01-2026 సంపుటి : 1 సంచిక :198 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-



ESHAGNA

ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G) , రిజిస్ట్రేషన్ చేయబడును

RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.



విలేకరులు కావలెను

గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

యం. నాగేశ్వర రావు

ఎడిటర్ గాయత్రి వార్తలు

సెల్ : 73860 45673





# జీఎస్టీ వసూళ్లలో... నూతనోత్సాహం

- డిసెంబరులో అధిక రాబడి
- కేంద్ర సగటు కన్నా రాష్ట్ర సగటు ఎక్కువ
- దక్షిణాది రాష్ట్రాల్లో 2వ స్థానం
- గత నెల వరకు మొత్తం రూ.39,517 కోట్ల రాక

**అమరావతి:** జీఎస్టీలో సవరణలు తీసుకొచ్చినప్పటికీ గత ఏడాది డిసెంబరు నెలలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక నికర వసూళ్లను సాధించింది. జీఎస్టీ శకం ప్రారంభమైన తర్వాత గత నెలలో రూ.2,652 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించింది. అంతే కాదు గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అధిక వసూళ్లు సాధించింది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు, వస్తు వినియోగం పెరిగిందనేందుకు ఇది సంకేతమని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు పేర్కొన్నారు. దిగుమతులను మినహాయించి పరిశీలిస్తే దేశంలో సగటున 5.61% వృద్ధి రేటు నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో అది ఏకంగా 5.78% ఉండటం గమనార్హం. జాతీయ వృద్ధి రేటును దాటి రాష్ట్రంలో జీఎస్టీ నికర వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు 9 నెలల కాలంలో మొత్తం రూ.39,517 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాష్ట్రంలో సాధ్యమయ్యాయి. అందులో కేంద్రానికి, ఇతరత్రా వెళ్లే వాటిని మినహాయిస్తే రూ.25,926 కోట్ల నికర జీఎస్టీ ఖజానాకు చేరింది. దక్షిణాది రాష్ట్రాల్లో జీఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తమిళనాడు 7.85% వృద్ధితో తొలిస్థానంలో ఉంది. కరా?టక (5.12%), కేరళ (3.69%), తెలంగాణ (2.45%)లను దాటి ఆంధ్రప్రదేశ్ వృద్ధి

..2వ పేజీలో



## బాబు పాలన

# కేసీఆర్‌కు నచ్చితే ఎంత.. నచ్చకపోతే ఎంత

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


**నెల్లూరు :** 'రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు చేయడం బాధగా ఉంది. చంద్రబాబును స్టేట్స్‌మన్ అని ప్రపంచమంతా కీర్తిస్తోంది. ఆయన పరిపాలన కేసీఆర్‌కు నచ్చితే ఎంత.. నచ్చకపోతే ఎంత' అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండిపడ్డారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సూపర్ సిక్స్‌తో సుపరిపాలన అందించి సూపర్‌హిట్ కొట్టామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై మాటలకే పరిమితమైన గత ప్రభుత్వానికి భిన్నంగా.. కూటమి ప్రభుత్వం చట్టం చేసిందని గుర్తుచేశారు. ఆగమశాస్త్ర నియమాల మేరకు ఆలయాల్లో పూజలు జరుగుతున్నాయని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అపచారాలను సరిచేశామని చెప్పారు. దేవాదాయశాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, వేద విద్యను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాకతో రామరాజ్యం ఆరంభమైందని, ఎవరూ అడ్డుకోలేరని మంత్రి ఆనం స్పష్టం చేశారు.

# ప్రాజెక్టులపై సీఎం దృష్టి

## ఈ నెలలోనే పోలవరం, వెలిగొండతో పాటు ఉత్తరాంధ్రకు చంద్రబాబు

## నీటివిధానం ముసాయిదా విడుదలకు ఏర్పాట్లు..సిద్ధమవుతున్న జలవనరులశాఖ

**అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెలలో సాగునీటి ప్రాజెక్టుల బాట పట్టబోతున్నారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులనూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. గడువులోగా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేయడంపై సమీక్షిస్తారు. ఈ మేరకు సీఎంఓ నుంచి జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు గురువారం సమాచారం అందింది. ఈ జనవరి తొలివారంలోనే పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనేది లక్ష్యం. గోదావరి పుష్కరాలు 2027 జూన్ చివరివారంలో మొదలవుతాయి. సరిగ్గా అప్పుడే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తే బాగుంటుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు తొలివిడత నిధుల మంజూరుతో పాటు, అడ్వాన్సుగా నిధులిచ్చేందుకు అంగీకరించిన క్రమంలోనే కేంద్రం గడువు కూడా నిర్దేశించింది. ఇప్పటికే కాఫర్ డ్యాం పనులు ఓ కొలిక్కి వస్తున్నాయి. మరోవైపు గ్యాప్ 1 ప్రధాన డ్యాం పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన డ్యాం గ్యాప్ 2 పనులూ సాగుతున్నాయి. డయాఫ్రం వాల్‌పై ప్రధాన డ్యాం పనులు ప్రారంభించారు. వీటితోపాటు కుడి, ఎడమ కాలువలను అనుసంధానించే పనులూ వేగంగా జరుగుతున్నాయి. 2027 ఖరీఫ్ నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలు, నిర్మాణ పురోగతిపైనా ముఖ్యమంత్రి దృష్టి సారించనున్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు జనవరి నెలాఖరుకు పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయి. పోలవరం వద్ద చేపట్టే పర్యాటక ప్రాజెక్టులపైనా సీఎం సమీక్షిస్తారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ఈ ఏడాది నీటి విధానానికి ముసాయిదా విడుదల చేయనున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు 80%కు మించి అందుబాటులో ఉండటంతో అన్ని ప్రాంతాల్లో చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నీళ్లు అందుబాటులో ఉన్నందున ఖరీఫ్ సాగు ముందుగా ప్రారంభించాలనేది ప్రణాళిక. భూగర్భజలాలు పెంచే ప్రణాళికలనూ గ్రామాలవారీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ నీటివిధానంపై ముసాయిదా విడుదల చేస్తారు. పారిశ్రామిక, తాగు, సాగునీటి విడుదలకు ప్రణాళిక వెలువరిస్తారు.



**వెలిగొండకు జనవరి 7 లేదా 9న..** వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 7 లేదా 9న సీఎం సందర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి నల్లమలసాగర్‌కు నీళ్లు మళ్లించి తొలిదశలో 1,19,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. రెండు టన్నెళ్లలో బెంచింగ్ లైనింగ్ పనులు పూర్తిచేసేలా అడుగులు పడుతున్నాయి. ఇలా నీళ్లు ఇవ్వాలంటే హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్‌ల నిర్మాణం పూర్తిచేయాలి. తొలి టన్నెల్‌లో 15 మీటర్ల మేర లైనింగ్, రెండో టన్నెల్‌లో 361 మీటర్ల మేర బెంచింగ్ తవ్వకంతో పాటు 3,686 మీటర్ల మేర లైనింగ్ చేయాలి. ఫీడర్ కాలువలో పెండింగ్ పనులనూ కొలిక్కి తేవాలి. ఇక్కడ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులూ ప్రారంభమయ్యాయి. తీగలేరు కాలువకు హెడ్ రెగ్యులేటర్ల నిర్మాణమూ సాగుతోంది. పునరావాసం కూడా పూర్తిచేయాలి. నల్లమలసాగర్‌లో ఉన్న గ్రామాలను ఖాళీచేయించాలి. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నా రూ.500 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎం ఈ పనులు పరిశీలించి, మార్గదర్శనం చేస్తారు.

**ఉత్తరాంధ్రకు 17న...** ఈ నెల 17న ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దృష్టిసారిస్తారు. ఆయన ఏ ప్రాజెక్టును సందర్శిస్తారో ఇంకా ఖరారు కావాలి. ఈ జిల్లాల్లో రూ.2,087 కోట్లు ఖర్చుచేస్తే 9 ప్రాజెక్టులు పూర్తవుతాయని జలవనరులశాఖ ప్రణాళిక రూపొందించింది. కొత్త ఆయకట్టు 1.24 లక్షల ఎకరాలు సాగులోకి రావడంతో పాటు 2.48 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉపకరిస్తుంది. నేరడి బ్యారేజి నిర్మాణం చేపట్టాలనే భావనతో రాష్ట్రప్రభుత్వం ఉంది. ఇందుకు వీలుగా వంశధార ట్రైబ్యునల్ తుది నోటిఫికేషన్ వెలువరించాలని పట్టుబడుతోంది.

# క్షణ క్షణం.. భయం భయం..!!

## కాల్పులతో వణికిన బళ్లారి

- తోపులాటలో మాజీ మంత్రి శ్రీరాములు
- ఘర్షణలో బ్యానర్లను చింపివేస్తున్న కార్యకర్తలు
- రాళ్లు, బీరు సీసాలను విసిరేందుకు ఓ కార్యకర్త యత్నం
- కాంగ్రెస్ కార్యకర్తలను నియంత్రణ చేస్తున్న పోలీసులు



**'ఇంటిపైకి గుండాలను పంపారు'...** మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డిలకు నేర చరిత్ర ఉంది. 25 ఏళ్ల నుంచి రౌడీయిజం చేస్తున్నా వాటిని తొక్కుకుంటూ భాజపాను అధికారంలోకి తెచ్చాం. వారి చుట్టూ హత్యలు చేసిన గుండాలను పెట్టుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం రాత్రి తన నివాసం ముందు కలిసిన విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం ఇంటి ఆవరణలో బ్యానర్లు కట్టారని తమ సెక్యూరిటీ గార్డ్ మా దృష్టికి తీసుకొచ్చాడు. అనంతరం బ్యానర్ పడిపోయింది. దీనిపై క్షమాపణ చెప్పి బ్యానర్ కడుతామని చెప్పాం. అనంతరం మా ఇంటి ముందు రహదారిపై ఎమ్మెల్యే ఆప్తుడు సతీష్‌రెడ్డి, చానాళ్ శేఖర్ కుర్చీ వేసుకుని కూర్చున్నారు. వారితో పాటు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఘర్షణలో ఇంటిపై రాళ్లు విసిరారు. సరిగ్గా నేను గంగావతి నుంచి వచ్చే సమయంలో సతీష్‌రెడ్డి భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారు. తమ ప్రభుత్వంలో రూ.8 కోట్లతో



..2వ పేజీలో

బ్యానర్ల తొలగింపు విషయంపై బళ్లారి నగరంలో గురువారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చేయి దాటి పోవడంతో భద్రతా సిబ్బంది గాల్లోకి కాల్పులు జరపడం, రాజశేఖర్ అనే యువకుడి మృతితో ప్రశాంతంగా ఉన్న నగరంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇరువర్గాల కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి, కాల్పులు, చివరికి ఒకరు మృతి చెందే వరకు దారితీయడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. ఈ పరిణామాంతో సామాన్య ప్రజలు వణికిపోయారు. ఘర్షణలో కాంగ్రెస్ కార్యకర్తలు గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి రాత్రి 9.30 గంటలకు ఘటనా స్థలానికి చేరుకోవడంతో అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరోసారి రెండు వర్గాల మధ్య ఘర్షణ తారస్థాయికి చేరుకుంది. రాళ్లు, బీరు సీసాలు కూడా విసురుకున్నారు. పోలీసులు సైతం రాళ్ల దాడిని తప్పించుకోవడానికి పరుగులు తీయాల్సి వచ్చింది. చివరికి ఎస్పీ ఆదేశాలతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. బళ్లారిలో జరిగిన ఈ సంఘటనతో ఎన్నడూ లేనంతగా పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.



# ఏపీలో త్వరగా ఎస్ఐఆర్ ప్రారంభించండి

## కేంద్ర ఎన్నికల సంఘానికి జనసేన వినతి

**దిల్లీ:** దేశవ్యాప్తంగా మొదలుపెట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను స్వాగతిస్తున్నామని జనసేన పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా మొదలుపెట్టాలని కోరింది. ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియలో చేయాల్సిన మార్పులుచేర్పులు, తీసుకురావాల్సిన సంస్కరణల గురించి వివిధ రాజకీయ పార్టీలతో సమావేశమవుతూ వస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం గురువారం జనసేన పార్టీ ప్రతినిధులతో భేటీ అయింది. ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, మిగతా కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు జనసేన ప్రతినిధులు ఇ.ప్రతాప్ కుమార్, ఆర్ఎంవీ సుమంత్‌లతో సమావేశమై వివిధ అంశాలపై వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం ఏడు అంశాలపై జనసేన సూచనలు, సలహాలను లిఖితపూర్వకంగా అందించింది. "వివిధ రాష్ట్రాల్లో 'ఎస్ఐఆర్'తో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన.. ఎన్నికల సంఘం రాజ్యాంగ నిబద్ధతను, స్వేచ్ఛగా, నిజాయతీగా ఎన్నికలు నిర్వహించే విషయంలో ఉన్న చిత్తశుద్ధిని చాటి చెబుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ అలాంటి కార్యక్రమం చేపడితే ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజలకున్న నమ్మకాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేస్తుంది. అలాగే

..2లో..

# ఏపీలో త్వరగా ఎస్ఐఆర్ ప్రారంభించండి

**(మొదటిపేజి తరువాయి)** ప్రతి పౌరుడికీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు బాటలు వేస్తుందని విశ్వసిస్తున్నాం" అని జనసేన విజ్ఞప్తి చేసింది.

**జనసేన సూచనలు, సలహాలు...** వలస కార్మికులు, పట్టణాల్లో పనిచేసే ఉద్యోగులు తమ నియోజకవర్గాల్లో భౌతికంగా హాజరై ఓటు వేయాల్సిన అవసరం లేకుండానే ప్రత్యేక కేంద్రాల్లో లేదా డిజిటల్‌పరంగా నియంత్రించే ప్రత్యేక వేదికలతో ఓటు హక్కు వినియోగించుకొనే విధానం అమల్లోకి తేవాలి. వలస కార్మికులను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఐటీ, ఇండస్ట్రియల్ హబ్స్‌లో మొబైల్ ఎన్‌రోల్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. ఓటు వేసేందుకు ఓటర్లు గంటల తరబడి క్యూల్లో వేచి ఉండాల్సి వస్తున్న తరుణంలో కేంద్రాల వద్ద వసతులు ఏర్పాటుచేయాలి. అపాయింట్‌మెంట్ ఆధారిత ఓటింగ్ లేదంటే విభిన్న ఓటింగ్ స్లాట్స్ కేటాయించాలి. ఓటర్ల జాబితాలో డూప్లికేషన్‌ను కనిపెట్టి పరిహరించడానికి ఏఐని ఉపయోగించాలి. చేరికలు, తీసివేతలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తూ రియల్‌టైం డ్యాష్‌బోర్డును తీసుకురావాలి. ఓటరు రిజిస్ట్రేషన్, తప్పులు సరిదిద్దుకొనే ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. జాబితాలను ఏటా థర్డ్‌పార్టీ ద్వారా ఆడిటింగ్ చేయించాలి. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసిన ఉద్యోగులను గుర్తించి, చర్యలు తీసుకోవాలి.

# క్షణ క్షణం.. భయం భయం..

**(మొదటిపేజి తరువాయి)** వాల్మీకి భవనం నిర్మించాం. ఇప్పటికే వాల్మీకి విగ్రహం ప్రతిష్ఠించినా మళ్లీ ఎందుకని ప్రశ్నించారు. రాజకీయ భవిష్యత్తు లేదని, అభివృద్ధి



చేయలేక ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని గాలి ఆరోపించారు.

**వాల్మీకీ అజ్జ చూసుకుంటారు...** బళ్లారి నగరంలో వాల్మీకి విగ్రహం ప్రతిష్ఠను శాంతియుతంగా నిర్వహిస్తున్నాం. వారికి భవిష్యత్తు ఉండదు. ఈ కార్యక్రమం జరగకుండా చూడాలని ఘర్షణకు పాల్పడుతున్నారని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆరోపించారు. బ్యానర్ విషయంలో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వాల్మీకి అజ్జ వారి పాపాలను చూసుకుంటారని తెలిపారు. వారికి వయస్సు 60 నుంచి 65 ఏళ్ల ఉండవచ్చు. నాకు 35 ఏళ్ల ఉంటాయి.యువకులే శాంతియుతంగా ముందుకు వెళ్తుంటే వయస్సు మీదపడినా వారే రెచ్చగొట్టేలా చేయడం సరికాదన్నారు. ఈఘటనపై చట్టపరంగా ముందుకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు.

# జీఎస్టీ వసూళ్లలో నూతనోత్సాహం

**(మొదటిపేజి తరువాయి)** సాధించడం విశేషం. ఆటోమొబైల్, సిమెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 23.69% వృద్ధి కనిపించింది. గత ఏడాది డిసెంబరులో ఎస్‌జీఎస్టీ వసూళ్లు రూ.1,102 కోట్లకు చేరుకున్నాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే 2.46% వృద్ధి నమోదైంది. ఐజీఎస్టీ సర్దుబాట్లు కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాయి. ఐజీఎస్టీ సర్దుబాట్ల రూపేణా రాష్ట్రం రూ.1,549 కోట్ల ఆదాయం రాబట్టింది. 2024 డిసెంబరు నెలతో పోలిస్తే ఇందులో 8.29% వృద్ధి ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా రూ.1,448 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో నెలతో పోలిస్తే 3.89% వృద్ధి ఉంది. వృత్తి పన్ను వసూళ్లలోనూ 2025 డిసెంబరు చక్కని ఫలితాలు కనబరిచింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో పోలిస్తే 38.32% వృద్ధి నమోదైంది. జీఎస్టీ నికర, స్థూల వసూళ్లలో తొలి త్రైమాసికంలో తగ్గుదల కనిపించగా.. ఆ పరిస్థితులను తారుమారు చేసి వృద్ధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు కారణమయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు.

# నీళ్లలో అన్యాయం.. నిధుల దోపిడీ

## కేసీఆర్ హయాంలో పాలమూరు-రంగారెడ్డిలో భారీ అవినీతి

## విచారణకు ఆదేశిస్తారన్న సమాచారంతో గోదావరిపై చర్చ చేస్తున్నారు

భారాసను బతికించుకునేందుకు తెరపైకి నీటి సెంటిమెంట్ నీళ్ల విషయంలో కేసీఆర్, హరీశ్‌రావు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చించి విచారణకు ఆదేశిస్తారన్న సమాచారం ఉప్పందడంతో పక్కన పెట్టిన బనకచర్ల, నల్లమలసాగర్, గోదావరి ప్రాజెక్టులపై మాట్లాడుతున్నారు. "నీళ్ల వెనకాల రాజకీయం ఉంది. ఎన్నికల్లో పార్టీ ఓడిపోతూ వస్తుండడంతో భారాస మనుగడ కష్టమవుతుందనే ఆ పార్టీ నేతలు జలవివాదం తీసుకొస్తున్నారు. కేసీఆర్, హరీశ్‌రావు అసత్యాలతో అపోహలు సృష్టిస్తున్నారు. ఏపీకి రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారన్న అపోహ ద్వారా పార్టీని బతికించాలని అబద్ధాలు చెబుతున్నారు. **-సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్:** కేంద్రం వద్ద ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కృష్ణా? నదిలో నీటి కేటాయింపుల పత్రంపై నాడు కేసీఆర్ చేసిన సంతకంతో తెలంగాణకు శాశ్వత అన్యాయం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్, హరీశ్‌రావులు తెలంగాణను అచేతనావస్థలోకి నెట్టేసి... ఏపీ వారిని బలవంతుల్ని చేశారని ఆరోపించారు. ప్రజాభవన్‌లో గురువారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా? జలాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృష్ణా? నీటికి తెలంగాణలో తల అయిన జూరాల దగ్గర వదిలేసి తోకలాంటి శ్రీశైలం దగ్గర నీటిని తీసుకునేలా నాడు భారాస పాలకులు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేయడంతో నీటి విషయంలో అన్యాయం, నిధుల దోపిడీ జరిగిందన్నారు. 'తలదగ్గర ఒడిసి పట్టుకుంటే ఏపీకి చుక్కనీరు వెళ్లే అవకాశం ఉండేది కాదు. వచ్చినవి వచ్చినట్లు తీసుకుంటే జగన్, చంద్రబాబు ఎవరికి చెప్పుకొనేవారు? తెలంగాణ గడ్డపైకి వచ్చి ఆపేవారా? మనం చెంబుడు నీళ్లు తీసుకునేలోపు.. ఏపీ బిందెలకు బిందెలు తీసుకెళ్లే అవకాశమిచ్చారు' అని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డిలో భారీ అవినీతి జరిగిందని, జూరాల నుంచి మారడంతో ప్రాజెక్టు వ్యయ అంచనాలు పెరిగాయి తప్ప.. రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం కలగలేదని తెలిపారు. 'పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలానికి మార్చినపుడు మంత్రి మండలి అనుమతి తీసుకోలేదు. ప్రాజెక్టు కట్టే స్థలం పేరు మారింది.. అంచనాలు మారాయి. ఇక్కడే భారీ అవినీతికి పునాదులు పడ్డాయి. రూ.వేల కోట్లు, కమీషన్లు ఎవరింటికి వెళ్లాయి' అని ప్రశ్నించారు. గత 25 ఏళ్లుగా కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ అబద్ధాలతో బతుకుతున్నారని, భారాసను బతికించుకునేందుకు నీటి సెంటిమెంట్‌ను ముందుకు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. తాము భారాస హయాంలో జరిగిన అన్యాయాన్ని, పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నామని వివరించారు. శాసనసభలో బలమైన వాదనలు వినిపిద్దామని, ఎవరినీ కించపరచవద్దని సూచించారు. శాసనసభ సమావేశాలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గైర్హాజరు కావద్దని, నూరుశాతం హాజరు ఉండాలని స్పష్టం చేశారు. "కేంద్రం వద్ద జరిగిన హైపవర్ కమిటీ సమావేశంలో తెలంగాణ సీఎంగా కేసీఆర్, నీటిపారుదలశాఖ మంత్రిగా హరీశ్‌రావు తెలంగాణకు 34శాతం(299 టీఎంసీలు), ఏపీకి 66శాతం(512 టీఎంసీలు) వాటాకు అంగీకరిస్తూ ఒప్పందం చేసుకున్నారు. ట్రైబ్యునల్ కేటాయింపులు చేసే వరకు ఇదే విధంగా వాడుకుంటామంటూ 2020లో సంతకాలు చేశారు. ఆ విధంగా శాశ్వతంగా తెలంగాణకు నష్టం చేశారు. ఏపీ 512 టీఎంసీలు వాడుకునేందుకు శాశ్వతహక్కు కల్పించారు. 21 ఏళ్లు గడుస్తున్నా నీటి కేటాయింపులపై తీర్పు రాలేదు.



ఎన్నేళ్లకు వస్తుందో తెలియదు. తీర్పువచ్చే వరకు కొనసాగిస్తామని చెప్పడంతో ఏపీకి అలుసుగా మారింది.



అంతర్జాతీయ జలవిధానం ప్రకారం పరీవాహకప్రాంత ప్రకారం నదీజలాల కేటాయింపు చేయాలి. ఈ లెక్కన తెలంగాణకు 71శాతం.. ఏపీకి 29 శాతం కేటాయింపులు ఉండాలి. ఆ ప్రకారం తెలంగాణకు 555 టీఎంసీలు కావాలని అప్పట్లో వాదించలేదు. కృష్ణా?నదిలో నీటిలభ్యత 1,005 టీఎంసీలు అని చెప్పినందున.. తెలంగాణకు 763 టీఎంసీలు, ఏపీకి 287 టీఎంసీలు ఇవ్వాలని మేం స్పష్టం చేశాం. ఈ దెబ్బతో ఏపీ ఉక్కిరిబిక్కిరి అయింది. ఏపీ ప్రతిపక్షనేత జగన్.. ఇటీవల చంద్రబాబుకు లేఖరాసి తెలంగాణ సమర్థంగా వాదన వినిపిస్తోందన్నారు. ఏపీ సరిగా ఎదుర్కోవడం లేదని చెప్పారు. తెలంగాణ హక్కులు సాధించుకోకుండా కిరణ్‌కుమార్‌రెడ్డి తయారు చేసిన పేపర్‌పై కేసీఆర్, హరీశ్‌రావు సంతకాలు పెట్టారు.

**మరో రూ.84 వేల కోట్లు ఖర్చు చేసినా పూర్తవుతుందన్న ఆశల్లేవ్...** గోదావరి బేసిన్‌లో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును రీడిజైన్ చేసి రూ.38,500 కోట్ల అంచనాను రూ.1.5లక్షల కోట్లకు పెంచినట్లే... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలానికి మార్చారు. మూడు స్టేజీలకు బదులు ఐదు.. 22 పంపులకు బదులు 37 పంపులు చేశారు. జూరాల నుంచి శ్రీశైలానికి తరలించి రూ.32,200 కోట్లు ఖర్చుచేశారు. ఇప్పుడు మరో రూ.84 వేల కోట్లు ఖర్చు చేసినా పూర్తవుతుందన్న ఆశల్లేవు. మరోవైపు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కొత్త ప్రాజెక్టు అని ఏపీ కేసు వేసింది. నది నీటిని బేసిన్ లోపల వాడుకోవాలి. అవతలికి తరలించకూడదు. కానీ ఏపీ ప్రభుత్వం కృష్ణా?బేసిన్ నీటిని పెన్నా బేసిన్‌కు తరలిస్తోంది. దీన్ని నిలిపివేయాలని కేసీఆర్ నాడు వాదించలేదు.

**దోపిడీ తెలుస్తుందనే నాడు డీపీఆర్ సిద్ధం చేయలేదు..** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి నాటి పాలకులు 2023 వరకు డీపీఆర్ సిద్ధం చేయలేదు. ఎందుకంటే అంచనాలు రూ.78 వేల కోట్లకు పెరిగిన విషయం ప్రజలకు తెలుస్తుందని... లిఫ్టుల పేరిట దోపిడీ బయటకు వస్తుందని. 2019లో బహిరంగ విచారణ చేయలేదు. సుప్రీంకోర్టు ముందు సాగునీటి ప్రాజెక్టు కాదు. తాగునీటి ప్రాజెక్టు అని చెప్పింది. దీంతో సుప్రీంకోర్టు 7.15 టీఎంసీల మేరకే పనులు చేయాలని, వ్యవసాయ వినియోగానికి నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పింది. దీంతో వేల కోట్లు ఖర్చుచేసిన ప్రాజెక్టు నిలిచిపోయింది. కేవలం కాంట్రాక్టు కమీషన్ల కోసం తాగునీటి ప్రాజెక్టుగా చిత్రీకరించారు.

**ప్రాజెక్టు పూర్తిచేసేందుకు ముందుకు వెళ్తున్నాం...** చిన్న నీటి వనరుల్లో ఆదా కారణంగా 45 టీఎంసీలు, పట్టిసీమ ద్వారా కృష్ణా?డెల్టాకు 80 టీఎంసీల తరలింపు నేపథ్యంలో 90 టీఎంసీలకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ వేశాం. ప్రధాని కృషి సించాయీ యోజన కింద అనుమతిస్తే కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుం ది. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని, సహాయం చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరాం. పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపులు ఉంటేనే చేస్తామని చెప్పారు. అందుకే చెరువులు, కుంటల డేటాను క్లస్టర్ల వారీగా ఇస్తామని చెప్పాం. రూ.84 వేల కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం 60శాతం నిధులిస్తే తద్వారా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలని ముందుకు వెళ్తున్నాం. అనుమతులు ఉంటే ప్రాజెక్టుకు 7.5 శాతం వడ్డీతో 30-40 ఏళ్ల కాలపరిమితితో టర్మ్ లోన్లు వస్తాయి. తొలివిడతలో 45 టీఎంసీలు, మరో విడతలో 45 టీఎంసీలతో బలమైన వాదనతో ముందుకు వెళ్తున్నాం.

శాసనసభలో చర్చకు వచ్చేందుకు జంకుతున్నారు భారాస హయాంలో నీటి అన్యాయం, నిధుల దోపిడీ జరిగింది. అందుకే శాసనసభలో చర్చకు హాజరయ్యేందుకు జంకుతున్నారు. చర్చలో ప్రతి కాగితాన్ని సభ ముందు పెడతాం. కృష్ణా? జలాల్లో జరిగిన అన్యాయం, దోపిడీపై విచారణ చేయించేందుకు టీవోఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించా. అందుకే కృష్ణా? నదిపై చర్చను వదిలేసి.. హరీశ్‌రావు బనకచర్ల, నల్లమల, గోదావరి ప్రాజెక్టులపై మాట్లాడుతున్నారు.

**ఆయన తెలంగాణ ప్రాజెక్టులపై అవగాహన కలిగిన అధికారి..** ఆదిత్యానాథ్ దాస్ ఉమ్మడి రాష్ట్రంలో 2007 నుంచి 2014 వరకు తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు కార్యదర్శిగా ఉన్నారు. తెలంగాణలో ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. తెలంగాణ ప్రాజెక్టులపై అవగాహన ఉన్నందునే సలహాదారుగా నియమించాం. ఆయన ఏపీ కాదు.. తెలంగాణకాదు.. బిహార్‌కు చెందిన వ్యక్తి. ఆయన ఎవరికీ చుట్టం కాదు. సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన్ను తొలగిస్తే తాము చేసిన దొంగతనం బయట పడకుండా ఉంటుందని హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**కేసీఆర్ దయచేసి రండి...** "కేసీఆర్.. దయచేసి శాసనసభకు రావాలి. మంచి వాతావరణంలో చర్చ చేద్దాం. నీటిహక్కులు కాపాడేందుకు మాకేం భేషజాలు లేవు. మాజీ సీఎం, మాజీ కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడిగా మీరిచ్చే సూచనలు, సలహాలు తీసుకుంటాం. మీ గౌరవానికి ఎలాంటి భంగం కలగదు. సభా నాయకుడిగా మాటిస్తున్నా. ఒకవేళ సభకు రాకుంటే ప్రతిపక్ష న్డాయకుడిగా సూచనలు చేయాలి. లేఖ రాయాలి. ఎలా ముందుకు వెళ్దామో చెప్పాలి. ఇప్పటికే ప్రాజెక్టుకు అన్యాయం జరిగింది. ఏదోరకంగా శక్తిని కూడదీసుకొని ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ముందుకెళ్తోంది" అని సీఎం అన్నారు.

# ఈ ఏడాది 12 వందేభారత్ స్లీపర్ రైళ్లు

## తొలి సర్వీసు కోల్‌కతా-గువాహటి మధ్య

**దిల్లీ:** సుదూర ప్రయాణాలు చేసే ప్రయాణికులకు వందేభారత్ స్లీపర్ రైళ్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. దీనిపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష?వ్ గురువారం ప్రకటన చేశారు. తొలి రైలు కోల్‌కతా-గువాహటిల మధ్య అందుబాటులోకి రానుందని



తెలిపారు. ఈ రైలు ఈ నెల 18 లేదా 19న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమవుతుందన్నారు. పశ్చిమబెంగాల్-అస్సాం మధ్య నడిచే ఈ రైల్లోని టికెట్ ధరలు.. విమాన టికెట్ల కంటే తక్కువే ఉంటాయన్నారు. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య విమాన ప్రయాణానికి రూ.6 వేలు నుంచి రూ.8 వేలు ఖర్చవుతోందని వైష?వ్ తెలిపారు. వందేభారత్ స్లీపర్‌లో థర్డ్ ఏసీలో టికెట్ ధర (ఆహారంతో కలిపి) సుమారు రూ.2,300, సెకెండ్ ఏసీలో సుమారు రూ.3 వేలు, ఏసీ ప్రథమ శ్రేణిలో సుమారు రూ.3,600 ఉంటుందన్నారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని టికెట్ ధరలు నిర?యించినట్లు చెప్పారు. ఆరు నెలల్లో మరో ఎనిమిది రైళ్లు సిద్ధమవుతాయని, ఈ ఏడాదిలో మొత్తం 12 రైళ్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 11 థర్డ్ ఏసీ, నాలుగు సెకెండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ పెట్టెలుండే ఈ రైల్లో 823 మంది ప్రయాణించవచ్చు. గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగంతో వెళ్లేందుకు వీలుగా రైలును తయారుచేసినా ప్రస్తుతానికి దీనిని 120-130 కి.మీ. వేగంతో నడిపిస్తారు.

# ఆ రెండింటిపై మోజు తగ్గితే మేలు

వెండి బంగారాలపై భారతీయుల మోజు దేశానికి రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు తెచ్చిపెడుతోంది. ఆర్థిక స్థిరత్వానికీ చేటు కలిగిస్తోంది. 2024తో పోలిస్తే 2025 అక్టోబరు నాటికి దేశీయంగా పసిడి దిగుమతులు మూడింతలు పెరిగి 1,472 కోట్ల



డాలర్లకు చేరాయి. వెండి దిగుమతులేమో అయిదు రెట్లు పెరిగాయి. ఈ దిగుమతుల వల్ల మన విదేశీ మారకద్రవ్య నిల్వలు హరించుకుపోయి, రూపాయి విలువ పడిపోతుంది. పర్యవసానంగా ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలి? పసిడి ధగధగలు చూడటానికి కన్నులపండువగా ఉన్నా దానివల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరగవు. మనం కొనే బంగారం బీరువాలు, బ్యాంకు లాకర్లలో మూలుగుతుందే తప్ప... పరిశ్రమల స్థాపనకూ, నూతన సాంకేతికతల సృష్టికీ, ఉపాధి కల్పనకూ ఏమాత్రం తోడ్పడటం లేదు. వెండి బంగారాలపై వంద కోట్ల డాలర్లు ఖర్చుపెడుతున్నామూ అంటే- ఉత్పత్తిని పెంచడానికి కావాల్సిన యంత్రాలు, ముడిసరకులు, ఇంధనం, సాంకేతికతల దిగుమతులకు అవసరమైన విదేశీ మారక ద్రవ్యానికి అంతమేర కోత పెడుతున్నామని అర్థం. జీఎస్టీ తగ్గడానికి తోడు దసరా, దీపావళి పండుగలు రావడంతో చాలామంది బంగారం దుకాణాలకు ఎగబడ్డారు. దీనికి పెళ్లిళ్ల సీజనూ తోడైంది. కేవలం అయిదు పండుగ దినాల్లోనే మనవాళ్లు ఏకంగా 1100 కోట్ల డాలర్ల విలువైన బంగారం, వెండిని కొనుగోలు చేశారు! ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సజావుగా లేకపోవడంతో బంగారం, వెండిపై పెట్టుబడి పెట్టడమే మంచిదనే భావన కూడా కొనుగోళ్లకు ఊతమిచ్చింది.

**పొదుపు పథకాలతో కళ్లెం...** దేశీయంగా వెండి బంగారాలు, యంత్రాలు, చమురు దిగుమతులు పెరగడం... ట్రంప్ సుంకాలతో ఎగుమతులు దెబ్బతినడం వంటివన్నీ కలిసి రూపాయి క్షీణతకు కారణమయ్యాయి. ఎగుమతులకన్నా దిగుమతులు ఎక్కువైనప్పుడు డాలర్ల కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. డాలర్లకు గిరాకీ పెరిగితే రూపాయి విలువ పడిపోతుంది. డిసెంబరులో ఒక డాలర్‌కు 90 రూపాయల చొప్పున చెల్లించాల్సి వచ్చింది. రూపాయి విలువ తగ్గితే చమురు, ఎలక్ట్రానిక్స్, వంటనూనెల దిగుమతులు ఖరీదవుతాయి. ఫలితంగా భారీ వాణిజ్య లోటు, ధరల పెరుగుదల, కుటుంబాలూ వ్యాపారాలపై ఒత్తిడి పెరగడం వంటివి సంభవిస్తాయి. అక్కడికీ రిజర్వు బ్యాంకు రూపాయి విలువను నిలబెట్టడానికి డాలర్లను విక్రయించినా అది ఏ మూలకూ చాల్లేదు. వెండి బంగారాల సంగతి అటుంచితే, భారత్ ఇప్పటికీ తన ఇంధన అవసరాల కోసం విదేశీ చమురు దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఉత్పాదక యంత్రాలను, ఎలక్ట్రానిక్ సాధనాలను దిగుమతి చేసుకోక తప్పడం లేదు. మేకిన్ ఇండియా, ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) వంటివి ఎగుమతుల వృద్ధికి పెద్దగా తోడ్పడటం లేదు. 40శాతం కార్మికులకు ఉపాధి చూపే సేద్యరంగం ఇప్పటికీ నూనె, పప్పు గింజల్లో స్వావలంబన సాధించలేకపోయింది. దాంతో పెద్దయెత్తున మారక ద్రవ్యాన్ని చెల్లించి వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఐటీ, బీపీవో ఎగుమతుల వల్ల విదేశీ ద్రవ్యం లభిస్తున్నా, అందులో చాలాభాగం బంగారం, వెండి, చమురు దిగుమతులకే చెల్లిపోతోంది. ప్రస్తుతం ఇండియా దగ్గర సుమారు 60,000 కోట్ల డాలర్ల విలువైన విదేశీ ద్రవ్య నిల్వలున్నాయి. రూపాయి విలువను నిలబెట్టడానికి వాటిని విక్రయించినా, వాణిజ్య లోటు భర్తీకి ఉపయోగించినా ఉన్న నిల్వలు హరించుకుపోతాయి. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని వేగంగా కుదుర్చుకుని, సుంకాలను తగ్గించుకోవాలి. తరవాత బంగారం, వెండి దిగుమతులపై అదనపు సుంకాన్ని విధించైనా వాటి కొనుగోళ్లకు అడ్డుకట్ట వేయాలి. వెండి బంగారాల కన్నా భద్రమైన, అధిక లాభదాయకమైన పెట్టుబడి, పొదుపు పథకాలను ప్రజలకు అందించాలి. ప్రభుత్వ బంగారం బాండ్ల పథకంలో మదుపును ప్రోత్సహించాలి.

**రూపాయి విలువ పడిపోతే...** ఎగుమతుల కోసం అమెరికాపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించడానికి ఇప్పటికే బ్రిటన్, న్యూజిలాండ్ తదితర దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు(ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంది. ఐరోపా సమాఖ్యతోనూ అలాంటి ఒప్పందమే కుదరనుంది. ఆసియాన్, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియాతోనూ ఎఫ్‌టీఏలను కుదుర్చుకోవాలి. రైతులు అధిక ఆదాయాన్నిచ్చే పంటలను సాగు చేయాలి. పప్పు, నూనె గింజల దిగుమతులను నిలిపేయడానికి వాటిని స్వదేశంలోనే భారీగా ఉత్పత్తిచేయాలి. పునరుత్పాదక ఇంధన వనరులతో విద్యుదుత్పాదన పెంచి చమురు దిగుమతులు తగ్గించాలి. రూపాయి విలువ పడిపోతే పెట్రోల్, డీజిల్ ధరలు, స్మార్ట్‌ఫోన్లు, మందుల ధరలు పెరిగిపోతాయని ప్రజలు గ్రహించాలి. మన విధానకర్తలు బంగారం, వెండి వేలంవెర్రిని తగ్గంచడానికి గట్టిచర్యలు తీసుకోవాలి. అత్యాధునిక సాంకేతికతతో అంతర్జాతీయంగా పోటీపడే స్థాయి వస్తుసేవలను ఉత్పత్తిచేసి ఎగుమతి చేయాలి. ఇందుకు శీఘ్ర కార్యాచరణ అత్యావశ్యకం.

# శ్రీకాళహస్తి టిడిపి కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు జనవరి 3 (శనివారం): రిపోర్టర్ : మునిరత్నం



సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నిర్వహించబడింది. ఈ వేడుకలు నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షులు మేకల దొరై రాజు, నియోజకవర్గ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి మద్దు మునిరాజ యాదవ్, పట్టణ బీసీ విభాగం అధ్యక్షులు పి. శ్రీనివాసులు రెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా బీసీ విభాగం నేతలు మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే గారు ఒక వ్యక్తి మాత్రమే కాకుండా ఒక సామాజిక విప్లవమని పేర్కొన్నారు. ఆనాటి కాలంలో బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా తీవ్రంగా వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో వారిని చైతన్యపరిచి ముందుకు నడిపేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే%–%సావిత్రిబాయి పూలే దంపతులు గ్రామ గ్రామాన తిరిగి విద్యను ఆయుధంగా చేసుకుని అక్షరాస్యతను పెంపొందించారని తెలిపారు. ఈ క్రమంలో సావిత్రిబాయి పూలే గారు ఎన్నో అవమానాలు, కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా బీసీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. అలాగే, స్వర్గీయ ఎన్.టి. రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి బీసీలను రాజకీయంగా, సామాజికంగా ముందుకు నడిపారని, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టి వారికి ప్రోత్సాహం కల్పించారని గుర్తుచేశారు. తదనంతరం నారా చంద్రబాబు నాయుడు పాలనలో బీసీలకు కార్పొరేషన్ లోన్లు, ఫైనాన్స్ సదుపాయాలు అందించి ఆర్థికంగా కూడా అభివృద్ధి దిశగా నడిపారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి కాలంలోనూ బీసీలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని, వారి వారసుడిగా ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి బీసీలను అక్కున చేర్చుకొని రాజకీయంగా అవకాశాలు కల్పిస్తూ, ఆర్థికంగా ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కామేష్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు జి. విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జి పేట బాలాజీ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ కె.వి. ప్రతాప్ రెడ్డి, టౌన్ మైనారిటీ సెల్ షేక్ షరీఫ్ భాష, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్. సుబ్రమణ్యం (బుజ్జి), పార్లమెంట్ బీసీ విభాగం కార్యదర్శి ఎం.ఎస్. రెడ్డి, రూరల్ బీసీ విభాగం అధ్యక్షులు ఎస్. ఈశ్వర్ రెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ ఏ. మురళి, వార్డు ఇంచార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి.

క్రోసూరు:గాయత్రి వార్తలు



మండలంలోని అనంతవరం గ్రామం ఎంపీపీ స్కూల్ లో మోడల్ బాలల పార్లమెంటు విద్యార్థిని విద్యార్థులు మహిళా టీచర్లకు ఘనంగా సన్మానం చేశారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె బాజిత్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారత దేశపు తొలి మహిళ గురువు మహిళ హక్కుల పోరాటానికి మార్గదర్శకరాలు ఆమె జయం తిని జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని స్త్రీలను గౌరవించడం మన భారతదేశ సాంప్రదాయం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సంస్థ ప్రతినిధి తండు లక్ష్మణ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1931లో జనవరి 3న మహారాష్ట్ర సతారా జిల్లాలో నాయ గాం గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. సావిత్రిబాయి పూలే ఆమె భర్త జ్యోతిరావు పూలే దగ్గర విద్యాభ్యాసం నేర్చుకొని బాలికలు మరియు మహిళలకు బోధించారు . సమానత్వం కోసం పోరాడిన మహాను భావురాలు 18 48లో పూణేలో బాలికల కోసం ఒక పాఠశాల ఏర్పాటు చేసి వారికి విద్యభ్యాసం బోధించారు. ఆమె ముఖ్యంగా కుల లింగ వివక్షత వలన ప్రజలకు జరుగుతున్న అన్యాలను వ్యతిరేకంగా పోరాడారు ఆధునిక విద్యతోనే స్త్రీకి విముక్తి సాధ్యపడుతుందని దాదాపు 52 పాఠశాలలు స్థాపించారు అదేవిధంగా సత్యశోధక్ సమాజ్ అనే సామాజిక ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించారు. సమానత్వం గురించి పిల్లలకు బోధించారు. సావిత్రిబాయి పూలే బాలికల పాఠశాలకు వెళుతున్నప్పుడు అనేక అవమానాలకు గురయ్యారు . ఆడవారికి విద్య బోధించడం కొంతమంది నచ్చక ఆమె పాఠశాలకు వెళ్లే సమయంలో బురద నీళ్లు చల్లి అనేక విధాలుగా అవమానించారు అయినా ఆమె బాలికలకు విద్య బోధించడం నా కర్తవ్యం అని తన భర్త జ్యోతిబాపూలే సహకారంతో ముందుకు వెళ్లి అనేకమంది పేదలకు విద్యను అందించారు. ఈ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు పాఠశాలలో విద్యను బోధిస్తున్న మహిళా టీచర్లు శౌరీలు, అనిత, ఉదయభాను, అనూష లను బాలల పార్లమెంటు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 30 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్లేటు,గ్లాస్ లు పంపిణీ.

పెదకూరపాడు:గాయత్రి వార్తలు



కాశిపాడు ఎంపీపీ హెచ్ డబ్ల్యు పాఠశాల నందు ప్లేట్లు, గ్లాసులు,వాటర్ బాటిల్స్ కు విద్యార్థిని విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 తాళ్లూరు ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.30 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్లేటు, గ్లాసు,వాటర్ బాటిల్స్ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత కుమార్తె అల్లుడు (లండన్) నరేష్ మౌనిక విద్యార్థులకు ఉచితంగా సమకూర్చారు మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ నరేష్ మౌనిక విద్యార్థులకు అవసరమైన వస్తువులను ఇచ్చినందుకు వారిని అభినందించారు.చిన్న వయస్సులోనే ఇలాంటి సామాజిక పరమైన విషయంలో సహాయం చేయటం అనేది గొప్ప విషయమని తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తుంది,అందరూ చదువుకోవాలని తెలియజేశారు.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గొప్ప వ్యక్తులు మాత్రమే సమాజ శ్రేయస్సు దానగుణం కలిగి ఉంటారని తెలియజేశారు. విద్యార్థులు వీటిని ఉపయోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు ఉపాధ్యాయులు శివప్రసాద్ క్లస్టర్ టీచర్ వి శివ, అంగనవాడి టీచర్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్ సీని సందర్శించిన జిల్లా వైద్య శాఖ అధికారులు

గాయత్రి వార్తలు



మండలం పరిధిలో గల అమరావతి కో-లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యాశాఖధికారి డాక్టర్ బి. రవి శనివారం సందర్శించారు.అక్కడ నుండి పీహెచ్ సి పరిధిలో అమరావతి -1 హెచ్ డబల్ సి ని సందర్శించారు.ఈ సందర్భంగా హెచ్ డబల్ సి లో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు అందజేశారు.జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు తీరును పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ సిస్టం ద్వారా సకాలంలో సిబ్బంది అందరూ విధులకు హాజరు కావాలన్నారు సి ఎస్ ఎస్ ఎం రిపోర్టును గూర్చి వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అత్తలూరు లో కాన్పుల అయ్యేవిధంగా సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్ ను పెంచాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రతిరోజు ఆర్ సి హెచ్ పోర్టల్ లో గర్భిణీ స్త్రీల పిల్లలు సర్వీస్ లను అప్లోడ్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్ మౌనిక డాక్టర్ ఎం. లీలప్రసాద్ , ఆరోగ్యవిస్తరణ అధికారి కే. లక్ష్మి మనోహర్,ఆరోగ్య పర్యవేక్షకులు జె. సాంబ్రాజ్యం,ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

# న్యాయవాది మధు తండ్రి మృతి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు



శ్రీకాళహస్తి పట్టణం ముత్యాలమ్మ గుడి వీధిలో నివసిస్తున్న హైకోర్టు న్యాయవాది మధు తండ్రి వేలాయుధం ఆచారి ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ నివాళుల కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని మృతుడికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే నివాళు లర్పించిన వారిలో షేక్ సిరాజ్ భాషా, కంట ఉదయ్ కుమార్, సర్వణ కుమార్, పటాన్ ఫరీద్, శ్రీవారి సురేష్, మున్నా రాయల్, జై శ్యామ్ రాయల్, శివకుమార్ యాదవ్, పెరుమాళ్ చౌదరి, చింతామణి పాండు, అడ్వకేట్ శేఖర్ తదితరులు ఉన్నారు. వేలాయుధం ఆచారి మృతి పట్ల స్థానికులు, న్యాయవర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని పలువురు ఆకాంక్షించారు.

# వివేకానంద స్కూల్ వ్యాన్ బోల్తా

జనవరి 3 గాయత్రి వార్తలు



ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మొద్దులగూడెం గ్రామం లో ఉన్న వివేకానంద స్కూల్ బస్సు పిల్లలను ఎక్కించుకుని వెళ్తుండగా పెనుబల్లి మండలం గణేష్ పాడు ఎన్ ఎస్ పి కాలువ దగ్గర అదుపు తప్పి బోల్తా పిల్లలను సంఖ్య కు మించి ఎక్కించుకున్నట్లు సమాచారం బస్ డ్రైవర్ మద్యం తాగి బస్సు నడపటం తో అదుపు తప్పి జరిగిన ప్రమాదం గా భావిస్తున్న స్థానికులు పరారీ లో ఉన్న బస్సు డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇచ్చిన గణేష్ పాడు ప్రజలు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

- మహిళా ఉపాధ్యాయులకు అపూర్వ సన్మానం

జనవరి 3 గాయత్రి వార్తలు



ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెలేూరే బాలుర వసతి గృహ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే ఆశయాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమం ప్రారంభంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాశాని శ్రీనివాసరావు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ, అక్షరజ్ఞానం లేని రోజుల్లో అనేక అవమానాలు, అడ్డంకులు ఎదుర్కొని మహిళల విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలవడానికి ఆమె వేసిన పునాదే కారణమని అన్నారు.

"మహిళా ఉపాధ్యాయులకు సన్మానం"

వేడుకలలో భాగంగా పాఠశాల యాజమాన్యం మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించింది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న మహిళా ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ ఈ సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాశాని శ్రీనివాసరావు, ఏటీపీ అజీమ్ జానీ, బీఐ అజయ్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు. సత్కారాన్ని అందుకున్న మహిళా ఉపాధ్యాయులు తమ సేవలను గుర్తించి సావిత్రిబాయి పూలే జయంతి రోజున గౌరవించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థుల అభ్యున్నతికి మరింత అంకితభావంతో పనిచేస్తామని వారు పేర్కొన్నారు. ఈ వేడుకతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.


# ఘనంగా సావిత్రిభాయి పూలే జయంతి



కుక్కునూరు: మండలంలో ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల్లో ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక కుక్కునూరు సంఘం ఆధ్వర్యంలో శనివారం సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆ మహానీయురాలికి ఘన నివాళిర్పించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఏఐటీయూసీ కుక్కునూరు మండల కన్వీనర్ కొన్నె. లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కుక్కునూరు కార్యదర్శి కురాకుల.బాబూరావు మాట్లాడారు.ఎటువంటి కుల వివక్ష లేకుండా స్త్రీ మూర్తికి అక్షరాలు దిద్ది తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఘనత దక్కించుకున్న వీర వనిత సావిత్రి భాయి పూలే అని ఉద్ఘాటించారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రి భాయి పూలే అని పేర్కొన్నారు. సావిత్రి భాయి పూలే సేవలకు గుర్తింపుగా ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరమ్మ , చంద్రకళ,జగదాంబ, కనకదుర్గ, మంగతాయారు,నాగమణి, రామలక్ష్మి,విద్యార్థులు పాల్గొన్నారు.


# ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడుగా కంచర్ల మార్కు

పెదకూరపాడు గాయత్రి వార్తలు





ఎస్సీ సెల్ పెదకూరపాడు మండల ఉపాధ్యక్షులుగా కంచర్ల మార్కును నియమించారు. తనకి అవకాశం కల్పించిన స్థానిక మండల నేతలకు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం పుట్టినరోజు జరుపుకుంటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వంద రోజులు 100 గ్రామాలు కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని తక్షణ చర్యలుగా అధికారులతో చర్చించి సమన్వయంతో పని చేస్తున్నారని మార్కు అన్నారు. మండల ఎస్సీ కాలనీవాసుల తరపు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# సంక్రాంతి బరిలో మాస్ మహారాజా.. హుషారెత్తిస్తున్న 'వామ్మో.. వాయ్యో..' సాంగ్





మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. క్లాస్ చిత్రాల దర్శకుడు కిషోర్ తిరుమల దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మేకర్స్ తాజాగా ఈ సినిమాలోని 'వామ్మో.. వాయ్యో..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తనదైన మాస్ బీట్స్‌తో స్వరపరిచిన ఈ పాటకు దేవ్ పవార్ సాహిత్యం అందించగా, స్వాతిరెడ్డి తన గాత్రంతో పాటకు మరింత హుషారుని తీసుకువచ్చారు. రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం కిషోర్ తిరుమల మార్కు ఎమోషన్స్‌తో పాటు, రవితేజ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా సాగే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది.



# 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ డేట్ ఫిక్స్..

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12, 2026న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## ఆది సాయికుమార్‌కు పెద్ద హిట్.. వారం రోజుల్లోనే..




హిట్టు కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నాడు హీరో ఆది సాయికుమార్. తన కంటే ఎక్కువగా అతడి తండ్రి, నటుడు సాయికుమార్ నిరీక్షిస్తున్నాడు. వీరి ఎదురుచూపులకు తెరదించుతూ 2025 ముగింపులో భారీ విజయం సొంతమైంది. శంబాల సినిమాతో ఆది హిట్టు కొట్టాడు. తండ్రి సినీ జర్నీ మొదలై 50 ఏళ్లు పూర్తయిన సమయంలో ఈ సక్సెస్ రావడం మరింత విశేషం!

**వారం రోజుల్లోనే అన్ని కోట్లా?**

శంబాల విషయానికి వస్తే ఆది హీరోగా, అర్చన్ అయ్యర్ హీరోయిన్‌గా నటించారు. యుగంధర్ ముని దర్శకత్వం వహించగా మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించారు. ఈ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించాడు. ఈ మూవీ క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కేవలం వారం రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.16.20 కోట్లు రాబట్టింది. ఇప్పటికీ థియేటర్లలో విజయవంతంగా ఆడుతోంది. శంబాల సక్సెస్‌తో ఆదికి మంచి బూస్ట్ దొరికినట్లయింది!

# దళపతి క్రేజ్.. అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'జన నాయగన్' రికార్డులు



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తన సినీ ప్రస్థానానికి వీడ్కోలు పలుకుతూ నటిస్తున్న చివరి చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సంక్రాంతి కానుకగా జనవరి 9, 2026న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఓవర్సీస్ మార్కెట్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ సునామీ సృష్టిస్తున్నాయి. కేవలం విదేశీ బుకింగ్స్ ద్వారానే ఈ చిత్రం ఇప్పటివరకు రూ.15 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఇది విజయ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్‌గా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా ఈ సినిమా నందమూరి బాలకృష్ణ సూపర్ హిట్ చిత్రం 'భగవంత్ కేసరి'కి రీమేక్ అనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయంపై స్పందించిన దర్శకుడు హెచ్.వినోద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను ఈ వార్తలను ధ్రువీకరించను.. అలాగని కొట్టిపారేయను. ఇది కేవలం ఒక రీమేకా లేదా ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తి పొందిందా అనేది పక్కన పెట్టండి. ఇది పక్కా 'దళపతి' మూవీ. ప్రేక్షకులు ఆందోళన చెందకుండా థియేటర్లకు వచ్చి సినిమాను ఆస్వాదించండి" అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చుట్టూ ఉన్న సస్పెన్స్‌కు తెరదించుతూ చిత్ర బృందం రేపు (జనవరి 3) అధికారిక ట్రైలర్‌ను విడుదల చేయబోతోంది. ఈ ట్రైలర్ ద్వారా కథపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



## గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ప్రేమకథ.. టీజర్ రిలీజ్

ఆల్బమ్ సాంగ్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్.. 'మేమ్ ఫేమస్' సినిమాతో హీరో, దర్శకుడిగా హిట్ అందుకున్నాడు. దాదాపు రెండేళ్ల తర్వాత ఇప్పుడు 'గోదారి గట్టుపైన' అనే మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. రిలీజ్ ఎప్పుడనేది ఇప్పుడు వెల్లడించలేదు కానీ తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. గోదావరి బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఓ క్యూట్ ప్రేమకథ ఇదని తెలుస్తోంది. దీనికి తోడు ఫ్రెండ్స్ గ్యాంగ్‌తో చేసే కామెడీ ఉండనే ఉందని టీజర్‌తో క్లారిటీ ఇచ్చారు. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ హీరోహీరోయిన్లు కాగా సుదర్శన్, రాజ్ కసిరెడ్డి లాంటి కమెడియన్స్ ఉన్నారు. బహుశా వేసవిలో థియేటర్లలో రిలీజ్ చేస్తారేమో? అప్పట్లో షార్ట్ ఫిల్మ్ తీసి పేరు తెచ్చుకున్న సుభాష్ చంద్ర.. ఈ చిత్రంతో సినిమా దర్శకుడిగా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.

## టాలీవుడ్ సైకలాజికల్ థ్రిల్లర్.. రిలీజ్ ఎప్పుడంటే?



వెంకటేశ్ పట్నాలా స్వీయ దర్శకత్వంలో వస్తోన్న చిత్రం ఆల్ఫా రిడంప్షన్. తానే హీరోగా నటిస్తూ పట్నాలా ఫిల్మ్స్ బ్యానర్‌లో ఈ మూవీని నిర్మించారు. విభిన్న కథా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. యాక్షన్ అండ్ ఎమోషనల్ డ్రామాగా వస్తోన్న ఈ సినిమా అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని జనవరి 3న థియేటర్లలో విడుదల కానుంది.

ఈ చిత్రాన్ని సైకలాజికల్ యాక్షన్ డ్రామాగా రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ మూవీ కథేంటో అర్థమవుతోంది. రెగ్యులర్ యాక్షన్ సినిమాలకు భిన్నంగా తెరకెక్కించారు. మనిషిలోని భావోద్వేగాలను, ప్రాయశ్చిత్తాన్ని చూపే సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమాకు భువన్, మార్టిన్ సంగీతమందించారు.

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.